సాక్షి వరంగల్

శుక్రవారం | 24 | మే | 2024



ప్రశాంతంగా ఎడ్‌సెట్..

బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం వరంగల్, హనుమకొండలో ఐదు కేంద్రాలు, నర్సంపేటలో ఒక పరీక్ష కేంద్రంలో ఎడ్‌సెట్ ప్రశాంతంగా జరిగింది.

- 8లో▸



సీఎం ఆదేశాలతో తనిఖీ..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని గురువారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనిఖీ చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
43.0° /29.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉక్కపోతతోపాటు వేడి ఉంటుంది. రాత్రివేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కళాశాలను సీజ్ చేయాలి



కాశిబుగ్గ సెంటర్: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని వేణురావు కాలనీలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఏకశిల జూనియర్ కళాశాలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా నాయకులు మోహన్, ప్రవీణ్ కోరారు. ఈ మేరకు గురువారం వారు ఇంటర్మీడియట్ విద్యా జిల్లా అధికారి కాక మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు లేకుండానే విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



దుగ్గొండి: వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా అధికారి సత్యవాణి సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ వాణి విద్యాలయంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిసున్న రెజ్లింగ్ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడారు. రెజ్లింగ్ ప్రాచీన మల్లయుద్ధమని తెలిపారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచడంతోపాటు క్రమశిక్షణ అలవాటు చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరబోయిన రవి, సుధాకర్, రవి, రమేష్, ఇటికాల దేవేందర్ పాల్గొన్నారు.

ఖోఖోలో రాణించాలి

గీసుకొండ: ఖోఖోలో వేసవి శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుని జాతీయ స్థాయిలో రాణించాలని డీవైఎస్‌ఓ అధికారి టీవీఎల్.సత్యవాణి సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఖోఖో శిక్షణ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించి మాట్లాడారు. క్రీడాకారులు ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. శిక్షణ ఇన్‌చార్జ్ కోట రాంబాబు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి



కాశిబుగ్గ సెంటర్: కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి మాట్లాడుతూ నర్సంపేటలోని పరమేశ్వర సీడ్స్ యజమాని కృత్రిమ కొరత సృష్టించి బీటీ-2 యూఎస్ 7067 పత్తి గింజల ప్యాకెట్ రూ.864 ఉండగా రూ.1300, నాథ్ కంపెనీ సాకేత్ రకం విత్తనాల ధర రూ.2,500 ఉండగా రూ.3,200 వరకు బ్లాక్‌లో అధిక ధరలకు అమ్ముతూ రైతులను దోపిడీ చేస్తున్నారని వివరించారు. జిల్లాలో ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని, సీజన్ ప్రారంభంలోనే వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేసి, నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు. అలాగే, ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించినట్లు పైడి తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రా ఆనందర్, నాయకులు భూమా అశోక్, ఎలకంటి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గాయాలతో వలస కార్మికుడి మృతి

గీసుకొండ: గాయాలతో వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కార్మికుడు జితేంద్ర రుషి షిండే(35) గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని సిమెంట్ ఇటుకల తయారీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై ఈ నెల 20న ఉదయం బహిర్భూమికి వెళ్లి అక్కడే కింద పడిపోయాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఈ నెల 22న రాత్రి మృతి చెందాడు. ఆయన బావ విటల్ గోవిందా పగడే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



కాంగ్రెస్‌కు షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలి

- రాష్ట్రంలో ఆర్‌జీ, ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరుతో దోపిడీ
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- వివరాలు 8లో▸

పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఖమ్మం వెళ్లిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మార్గమధ్యలోని జనగామలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనను తలపిస్తున్న కాంగ్రెస్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు.

- జనగామ

మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



రాష్ట్ర ప్రభుత్వానిది నయవంచన

- సన్న వడ్లకే బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మోసం
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు

- వివరాలు 8లో▸

ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన భూపాలపల్లి, వర్ధన్నపేట, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల పట్టభద్రులు, బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆ పార్టీ సీనియర్‌నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో అబద్ధాల కాంగ్రెస్‌ను శిక్షించి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు.

- హసన్‌పర్తి/భూపాలపల్లి అర్బన్/తొర్రూరురూరల్/మరిపెడ

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన అభ్యర్థి తీన్మార్ మల్లన్న



యువతకు ప్రాధాన్యమిస్తున్న సర్కారు

- ఐదు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాల అమలు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- వివరాలు 8లో▸

మహబూబాబాద్ జిల్లా మరిపెడలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువతకు అధిక ప్రాధాన్యమిస్తోందని, ఐదు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

- మరిపెడ/మహబూబాబాద్ రూరల్


ఫేక్‌లున్నారు..జాగ్రత్త

కలెక్టర్ ప్రావీణ్య పేరుతో నకిలీ ఖాతా

- ఆపై ఫ్రెండ్స్ లిస్టులో ఉన్నవారికి రిక్వెస్ట్‌లు
- డబ్బులు ఫోన్ పే చేయాలంటూ మెసేజ్‌లు
- స్పందించిన వారి ఫోన్ నంబర్ల సేకరణ



వాట్సాప్ మెసేజ్ స్క్రీన్ షాట్‌లు



సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్లు ఈజీ మనీ కోసం ప్రముఖుల ఫేస్‌బుక్ ఖాతాలను మాయ చేస్తున్నారు. ఒరిజినల్ ఫేస్‌బుక్ ఖాతాను పోలి ఉండేలా వారి ఫొటోలతో నకిలీ ఖాతాలు క్రియేట్ చేస్తున్నారు. వారి ఫ్రెండ్స్ లిస్ట్‌లో ఉన్న వారికి రిక్వెస్ట్ పంపిస్తున్నారు. మెసెంజర్ ద్వారా అత్యవసరం ఉందని కొందరికి మెసేజ్ పంపి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించమని మోసం చేస్తున్నారు. ఈ విధంగా వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య పేరు మీద నకిలీ ఫేస్‌బుక్ ఐడీ తెరిచి డబ్బులు అవసరమంటూ మిత్రులు, ఇతర అధికారులకు మెసేజ్‌లు వెళ్లాయి. అలాగే, శ్రీలంక ఫోన్ నంబర్ (+94776414080)ను వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ ప్రావీణ్యది పెట్టి వరంగల్ కలెక్టరేట్‌లోకి కొంతమంది సిబ్బందికి 'హలో.. ఎలా ఉన్నారు.. ఈ సమయంలో ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నలు వేసి సమాధానం రాగానే నేను ఎక్కువగా ఫోన్ కాల్స్ స్వీకరించడానికి వీలులేదు. అత్యంత ముఖ్యమైన సమావేశంలో ఉన్నానంటూ వాట్సాప్ చేసి డబ్బులు అవసరమున్నాయని, ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ చేయాలి' అని మెసేజ్‌లు వెళ్లాయి. ఈ విషయం కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి రావడంతో ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. పై నంబర్ మోసపూరితమైనది.. దయచేసి జవాబు ఇవ్వకండి.. వీలైనంత త్వరగా బ్లాక్ చేయమని కలెక్టర్ కోరారు. గతంలోనూ అప్పటి కలెక్టర్ గోపి పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్ బుక్ ఖాతా తెరిచారు. డబ్బులు అవసరమంటూ సిబ్బందికి మెసేజ్ చేయడంతో ఈ విషయం బయటపడిన సంగతి తెలిసిందే.

నకిలీ ఖాతాలు.. వాట్సాప్ డీపీలతో..

సైబర్ నేరగాళ్లు ఇప్పుడు సోషల్ మీడియాను టార్గెట్ చేసుకున్నారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేయడం, అధికారుల ఫొటోలు, పేర్లు ఉపయోగించుకోవడం, కొత్త ఖాతాలు తెరిచి వీటి ఆధారంగా ప్రజలతో చాటింగ్ చేస్తున్నారు. ఇదంతా నిజమని నమ్ముతున్న ప్రజలు నిజంగానే తాము సదరు అధికారులతోనే మాట్లాడుతున్నట్లు ఫీలవుతూ, వారు ఏదడిగినా చేస్తున్నారు. దీంతో డబ్బు కావాలని రిక్వెస్ట్ పెట్టి తమ అకౌంట్లకు డబ్బులను బదిలీ చేయించుకుంటున్నారు సదరు కేటుగాళ్లు. పోలీసులకు ఇప్పుడు ఈ తరహా నేరాలు తలనొప్పిగా మారాయి. వీటితోపాటు ఆయా ఫేస్‌బుక్ ఖాతాల నుంచి సేకరించిన ఫోన్ నంబర్లకు కూడా వాట్సాప్ ద్వారా మెసేజ్ చేస్తున్నారు. ఆ వాట్సాప్ నంబర్‌కు సదరు అధికారుల ఫొటోలు డీపీగా పెట్టుకొని నిజంగా ఆ అధికారితో మాట్లాడినట్లు చేసి అత్యవసరమంటూ డబ్బు నాటకానికి తెరలేపుతున్నారు. ఈ నంబర్‌కు ఫోన్ పే, గూగుల్‌పే చేయాలంటూ కోరుతున్నారు. ఇది నమ్మి సైబర్ నేరగాళ్లకు కొందరు డబ్బులు పంపుతున్న ఘటనలు చాలాచోట్ల జరుగుతున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి..

సామాన్యుల నుంచి వీవీఐపీల వరకు చాలా మంది ఫేస్‌బుక్ ఖాతాలు పోలినట్లుగా సైబర్ నేరగాళ్లు నకిలీ ఖాతాలను సృష్టిస్తున్నారు. ఆయా ఖాతాల్లోని ఫ్రెండ్స్ లిస్టులోని పేర్లకు ఈ ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు. మెసెంజర్‌లతో చాట్ చేసి డబ్బులు అడుగుతున్నారు. ఇందులో స్పందించినవారికి ఆయా ఫ్రెండ్స్ లిస్ట్ నుంచి సేకరించిన ఫోన్ నంబర్లకు వాట్సాప్ ద్వారా చాట్ చేస్తూ అత్యవసర మీటింగ్‌లో ఉన్నానని, డబ్బులు ఫోన్ పే, గూగుల్ పే చేయాలంటుంటున్నారు. ఈ తరహా మోసాలు వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో అప్పుడప్పుడూ జరుగుతున్నాయి. వీటిపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ తరహాలో ఏమైనా మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

– అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పోలీస్ కమిషనర్

మోసపూరితమైన మెసేజ్‌లను నమ్మొద్దు : కలెక్టర్ ప్రావీణ్య



కాశిబుగ్గ సెంటర్: సామాజిక మాధ్యమాల్లో మోసపూరితమైన మెసేజ్‌లను నమ్మవద్దని, వెంటనే మెసేజ్ బ్లాక్ చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. తన పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించారని, మీటింగ్‌లో ఉన్నానని, అర్జెంట్ డబ్బులు కావాలంటూ 94776414080 శ్రీలంక నంబర్ నుంచి సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్‌పే చేసి, స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరుతూ పలువురికి మెసేజ్‌లు పంపారని పేర్కొన్నారు. దీన్ని గమనించి తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేసి తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశానని తెలిపారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వొద్దని కలెక్టర్ కోరారు. 9477641 4080 ఈ నంబర్ మోసపూరితమైనదని, వీలైనంత త్వరగా బ్లాక్ చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ప్రచార హోరు!

ఓరుగల్లుకు పోటెత్తుతున్న అగ్రనేతలు, ముఖ్యనేతలు

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కోసం సుడిగాలి పర్యటనలు
- ఎన్నికల ప్రచారానికి రేపటితో తెర.. పోలింగ్‌కు మరో మూడు రోజులే
- జోరందుకున్న పంపకాలు, ప్రలోభాలు..



సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోరు క్లైమాక్స్‌కు చేరుకుంది. మరో మూడు రోజుల్లోనే ఎన్నికల పోలింగ్ జరగనుండగా.. శనివారం సాయంత్రం ప్రచారం ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఓరుగల్లులో రెండు రోజులుగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులు, అగ్రనేతలు, ముఖ్యనేతలు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా కేడర్‌ను కలిసి ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపునకు మద్దతు కూడగడుతున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52 మంది బరిలో ఉండగా.. ఈనెల 27న పోలింగ్ జరగనుంది.

హీటెక్కిన ఎమ్మెల్సీ సమరం

పోటాపోటీ ప్రచారంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హీటెక్కింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్‌ఎస్, ఈసారి ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉండగా.. బలమైన ఓట్లు సాధించాలని బీజేపీ భావిస్తోంది. ప్రచారానికి ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థుల తరఫున కీలక నేతలు రంగంలోకి దిగారు. బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. అన్ని పార్టీల నాయకులు ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గస్థాయిల్లో పట్టభద్రుల సమావేశాలు నిర్వహించారు. మార్నింగ్ వాక్‌లు, సోషల్ మీడియా, టీవీ చానళ్లతో పాటు, వాట్సాప్ గ్రూపుల ద్వారా కూడా ప్రచారాన్ని ఉధృతంగా సాగిస్తున్నారు. అభ్యర్థులతో పాటు వారి తరఫున కీలక నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మరోవైపు తెరవెనుక బలం, బలగాన్ని ఉపయోగించి పట్టభద్రుల ఓట్లు సాధించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అందరి లక్ష్యం గెలుపే..

పట్టభద్రుల నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి వరుసగా గెలుస్తున్న బీఆర్‌ఎస్.. ఈసారి కూడా ఆ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది. పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు రంగంలోకి దిగారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కీలక నేతలను ఇన్‌చార్జ్‌లుగా పార్టీ అధిష్టానం నియమించింది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ స్థానం నుంచి రెండు పర్యాయాలు పోటీచేయడంతో ఆయనకున్న విస్తృత సంబంధాల రీత్యా పార్టీ అధిక భారం పెట్టింది. ఈ సీటును దక్కించుకోవడం ద్వారా ప్రశ్నించే ప్రతిపక్షంగా తాము పనిచేస్తామని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్‌లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. కాగా 2021 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న స్వల్ప మెజార్టీతో ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్ననే పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్ బరిలోకి దించింది. ఆయన గెలుపు కోసం ఉమ్మడి జిల్లాల మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీతక్కతోపాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి,గండ్ర సత్యనారాయణరావు, కీలక నేతలు ప్రచారం సాగిస్తున్నారు. మేధావి వర్గం, విద్యావంతులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు మల్లన్నను గెలిపించాలని కోరుతున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ పార్టీ నాయకత్వం గట్టిగా కృషి చేస్తున్నది. కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఈటల రాజేందర్, ఇతర ముఖ్యనేతలు ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు శ్రమిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడిందని, పార్లమెంట్ ఎన్నికల్లో తమదే పైచేయిగా చెబుతున్న బీజేపీ నేతలు.. తమ అభ్యర్థిని ఆదరించి గెలిపించాలని పట్టభద్రులను కోరుతున్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

- వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

కాశిబుగ్గ సెంటర్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో 7 అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని కౌంటింగ్ సెంటర్ల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థ అమలు, కౌంటింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్‌కు సంబంధించిన సమాచారం పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలియజేయడం తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బందికి సంబంధిత జిల్లాల్లోని జిల్లా రిటర్నింగ్ అధికారుల ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్, రిటర్నింగ్ అధికారి సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి, సంబంధిత ఏఆర్వోలు, కౌంటింగ్ సిబ్బంది రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు సాధారణ పరిశీలకుల సమక్షంలో సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ చేయనున్నట్లు వివరించారు. గుర్తింపు కార్డు కలిగి ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. సహాయ రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ హాల్లో అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ముందుగా ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు తర్వాత ఈవీఎంల ఓట్లు లెక్కించాలన్నారు. అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, సంధ్యారాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అశ్వినితానాజీ వాకడే, రోహిత్ సింగ్, వెంకన్న, నారాయణ, మంగీలాల్, డీఆర్‌ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వ నారాయణ, రమేశ్, తహసీల్దార్లు మహమ్మద్ ఇక్బాల్, విజయ్‌సాగర్ పాల్గొన్నారు.

వాన.. రైతుల యాతన



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన రైతు మంతెపురం రవీందర్. తనకున్న రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. చేతికందిన పంటను కల్లంలో ఆరబెట్టాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట తడవడంతో శనిగరం శివారులోని జాతీయ రహదారిపై ఆరబెట్టాడు. కుమార్తెను ఇంటి వద్ద ఉంచి భార్య రమ, 8 ఏళ్ల కుమారుడితో కలిసి ఆరబెట్టిన వేరుశనగ పంట వద్ద బుధవారం రాత్రి కాపలా ఉన్నాడు. ఒక్కసారి వర్షం కురవడంతో ఆరబెట్టిన పంటను కుప్పచేసి పాలిథిన్ కవర్లు కప్పాడు. మరోసారి తడవడంతో చేసేది ఏమిలేక గురువారం ఉదయం పంటను ఆరబెట్టాడు.

- కల్లాల్లో తడిసిన ధాన్యం, మక్కలు, పల్లికాయ
- ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల విజ్ఞప్తి



శనిగరంలో ఆరబెట్టిన వేరుశనగ పంట వద్ద కాపలా ఉన్న రైతు కుటుంబం

నల్లబెల్లి: యాసంగి పంటలు చేతికి వస్తున్న సమయంలో కురుస్తున్న వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో 1,03,962 ఎకరాల్లో వరి, 1,00,526 ఎకరాల్లో మొక్కజొన్న, 4,800 ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగుచేశారు. కాగా, ఇటీవల జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీనికి తోడు వడగళ్ల వానతో వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మక్కలు, వేరుశనగ తడిసి ముద్దయ్యాయి. బుధవారం వర్షం లేదని ఊపిరిపీల్చుకున్న రైతులు కల్లాల్లో పంటను ఆరబెట్టారు. అయితే, సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రాత్రి సమయంలో కుటుంబ సభ్యులతో రైతులు కల్లాల వద్దే కాపలా ఉన్నారు. నిద్రలోకి జారుకున్న సమయంలో వర్షం కురిసింది. తేరుకున్న రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలు చేసి పాలిథిన్ కవర్లు కప్పారు. ఇప్పటికే రెండుసార్లు ధాన్యం తడిసిందని, తేమ ఉందనే సాకుతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుకోలు చేయడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే ధాన్యం నాని మొలకలు వస్తుందని వారు పేర్కొంటున్నారు.

తేమ పేరుతో కొర్రీలు..

తరచుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం నాని తేమ సమస్య తలెత్తుతోంది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. తేమ ఉందని ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిరాకరిస్తుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు అందినకాడికి దండుకుంటూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

మరో రెండుమూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పుతుండడంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలన్నది రైతులకు సమస్యగా మారింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎండలో ఆరబెట్టాలి



వర్షానికి తడిసిన ధాన్యాన్ని అలానే వదిలేస్తే దెబ్బ తింటుంది. బస్తాల్లో నిల్వ చేసిన ధాన్యం, ధాన్యపు రాశులు వర్షానికి తడిస్తే టార్పాలిన్‌లో పోసి ఎండలో ఆరబెట్టాలి. తేమ 17 శాతం లోపు ఉండేలా చూడాలి. రంగుమారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం ఉన్నా రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. కొనుగోలు సమయంలో రైతులను నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తే తగు చర్యలు తీసుకుంటాం.

– పరమేశ్వర్, ఏఓ, నల్లబెల్లి

యువతకు ప్రాధాన్యమిస్తున్న సర్కారు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

మరిపెడ: కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యం ఇస్తోందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మరిపెడలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు ఒకేసారి రుణమాఫీ, గృహనిర్మాణం లాంటి పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థి మల్లన్న మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగ సమస్యలపై పోరాడుతానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, మానుకోట పార్లమెంట్ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, నేతలు భరత్‌చందర్‌రెడ్డి, నూకల నరేష్‌రెడ్డి, రఘువీరారెడ్డి, గందసిరి అంబరీషా, తాజుద్దీన్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఖజానాను కొల్లగొట్టారు ..

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ ఖజానాను బీఆర్ఎస్ ప్రభుత్వం కొల్లగొట్టిందని, కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లకతప్పదని నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీనటులు నాగచైతన్య, సమంత దంపతులు కేటీఆర్ వల్లే విడిపోయారని, ఆయనను రకుల్ రావు అని పిలవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ మానుకోట ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్నయాదవ్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉదయ్ చందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలి

- ఆర్‌జీ, ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరుతో దోపిడీ
- బీఆర్ఎస్‌ను తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

జనగామ : బీఆర్ఎస్ పాలనను తలపిస్తున్న కాంగ్రెస్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం పర్యటన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రం మీదుగా వెళ్తూ పట్టణంలో ఆగారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి స్వగృహంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ నమ్మించి మోసం చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్‌గాంధీ గ్రామాల్లో తిరుగుతూ పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు, కౌలు రైతులకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు, నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇస్తామని అధికారంలోకి రాగానే ప్రజల నెత్తిన టోపీ పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డిసెంబర్ 9వ తేదీన రైతు రుణమాఫీ చేస్తామని, ఆగస్టు వరకు పొడగించడంతో రైతులు పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు వ్యాపారుల అవతారాలెత్తి అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ ప్రచారం చేసి నేడు సన్నాలకు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. కేంద్రం దొడ్డు, సన్నరకం ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బంది ఏంటన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు, కాంగ్రెస్ ఆర్నెళ్ల పాలన సేమ్ టు సేమ్‌గా సాగుతోందన్నారు. ఆర్‌జీ, ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి ఎగబడిందని ఆరోపించారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి నిజాయితీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నాయకులు కేవీఎల్ఎన్‌రెడ్డి, మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, విద్యాసాగర్‌రెడ్డి, రమేశ్, అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానిది నయవంచన



హసన్‌పర్తి: నమస్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన వర్ధన్నపేట నియోజకవర్గ పట్టభద్రులు

- సన్న వడ్లకే బోనస్ ఇస్తామని మోసం
- కాంగ్రెస్ హామీలు తుస్సుమన్నాయి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మరిపెడ: మాట్లాడుతున్న హరీశ్‌రావు

తొర్రూరు రూరల్/హసన్‌పర్తి/భూపాలపల్లి అర్బన్/మరిపెడ: కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలనిచ్చి ప్రజలను మోసగించిందని, అబద్ధాల కాంగ్రెస్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో శిక్షించాల్సిందేనని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ గురువారం ఉమ్మడి జిల్లా పరిధిలోని భూపాలపల్లి, వర్ధన్నపేట, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన పట్టభద్రులు, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సమావేశాల్లో మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, రుణమాఫీ పంద్రాగస్టులోగా అమలు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 90 శాతం దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, పదిశాతం పండే సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను మోసగించడమేనన్నారు. బ్లాక్ మెయిల్ దందాలు, క్రిమినల్ కేసులు ఉన్న తీన్మార్ మల్లన్నకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఏనుగుల రాకేశ్‌రెడ్డిని బరిలో నిలిపామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో కేవలం ఒక్క బస్సు పథకం మాత్రమే అమలవుతోందని, మిగతావి అంతా తుస్సే అని ఎద్దేవా చేశారు. వరంగల్ జిల్లా అభివృద్ధికి బీఆర్ఎస్ సర్కార్ హయాంలో కోట్లాది రూపాయాలు ఖర్చు చేసినట్లు చెప్పారు. తెలంగాణ చిహ్నం నుంచి కాకతీయ తోరణాన్ని తొలగించడానికి ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు కాకున్న ఐదు హామీలు అమలు చేశామని అబద్ధాలతో ముఖ్యమంత్రి, మంత్రులు ప్రచారాలు చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ లేదని, దరఖాస్తుల ఫీజులు ఇష్టానుసారంగా పెంచారని, నూతన ఉద్యోగ నోటిఫికేషన్లు లేవన్నారు. అనంతరం మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకను పెద్దల సభకు పంపించాలని పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న ఓ చీటర్ అని పేర్కొన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసకారి పార్టీ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా అవకాశమిస్తే నిరుద్యోగ యువత, పట్టభద్రుల పక్షాన మండలిలో ప్రశ్నించే గొంతుకగా ఉంటానని, వేతనాన్ని సైతం పట్టభద్రుల కోసం వెచ్చిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, డీఎస్ రెడ్యానాయక్ అధ్యక్షతన జరిగిన ఆయా సమావేశాల్లో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, కోరుట్ల, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బానోతు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రసమయి బాలకిషన్, శంకర్‌నాయక్, హనుమకొండ, వరంగల్ జెడ్పీ చైర్మన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, జిల్లా నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



ఐలయ్య(ఫైల్)

ఎల్కతుర్తి: వడదెబ్బతో మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన పశువుల కాపరి గొర్రె ఐలయ్య(52) బుధవారం రాత్రి మృతి చెందాడు. పశువులను మేపేందుకు వెళ్లిన ఐలయ్య.. వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై కింద పడ్డా డు. గమనించిన స్థానికులు వెంటనే ముల్కనూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చాడు. రాత్రి నిద్రలోనే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా, ప్రభుత్వం ఐలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరారు.

సీఎం ఆదేశాలతో ఎంజీఎం తనిఖీ

- రోగుల సేవలపై నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మెడికల్ స్టోర్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఎంజీఎం : 'రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే ఎంజీఎం ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టా. ఆస్పత్రిలో లక్షలాది రూపాయలు వెచ్చించినా పరికరాలు అందుబాటులోకి తేవడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. రోగులకు మెరుగైన సేవలందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలి. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై విచారణ చేపట్టి చర్యలు చేపడుతున్నాం. వైద్యాధికారులను బతిమిలాడుతున్నా.. హెచ్చరిస్తున్నా.. మీ ఇష్టం ఉంటే విధుల్లో కొనసాగండి. లేదంటే వైదొలగండి కాని పేద రోగుల ప్రాణాలకు ఇబ్బంది కలిగించకండి' అంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆస్పత్రిని సందర్శించారు. మొదట ఎంజీఎం ఓపీకి చేరుకున్న ఆయన.. ఆ గదిలో మెడికల్ రిప్స్ యథేచ్ఛగా తిరుగుతూ తమ కంపెనీకి సంబంధించిన మందులు రెఫర్ చేయాలని వైద్యులకు వివరిస్తున్న దృశ్యం చూసి నివ్వెరపోయారు. సదరు పీజీ వైద్యులు అక్కడికి వచ్చిన ఎమ్మెల్యేను గమనించి కనీసం మర్యాదగా నిలబడకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అసలు ఎంజీఎంలో మెడికల్ రిప్స్ రావడమేమిటని పరిపాలన అధికారులను ప్రశ్నించారు. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌లో సుమారు రూ. 50 లక్షల విలువైన అఫారాసిస్ పరికరం ఆరు నెలల క్రితం తీసుకువచ్చిన ఎందుకు అందుబాటులోకి తేలేదని ప్రశ్నించారు. ఆ పరికరం అందుబాటులోకి తెచ్చేందుకు ఓ గది లేదని డాక్టర్ ప్రసాద్ ఎమ్మెల్యేకు వివరించడంతో ఒక్కసారి నివ్వెరపోయారు. ఇంతా పెద్ద ఆస్పత్రిలో ఓ గది లేదని చెప్పడం ఏమిటి అంటూ మండిపడ్డారు. మార్చురీ ఫ్రీజర్లు పనిచేయడం లేదనే విషయం దృష్టికి రావడంతో అక్కడ కారణమేమిటని అధికారులను ప్రశ్నించారు. ఏఎంసీ ఉన్న మరమ్మతులకు నోచుకోవడం లేదని వివరించడంతో సదరు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడాలని కోరారు. కంపెనీ ప్రతినిధులు స్పందించపోవడంతో అగ్రిమెంట్ చేసిన కంపెనీ ప్రతినిధులపై సాయంత్రంలోపు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

కమీషన్లకు కక్కుర్తి పడకండి..

ఎంజీఎం ఆస్పత్రికి నిరుపేద రోగులు వస్తారు. అలాంటి వారికి పరికరాలు, మందులు లేవని, రక్తపరీక్షలు చేయడం లేదంటూ బయటకు పంపించి కమీషన్లకు కక్కుర్తి పడకండి అంటూ వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ ఎంజీఎం ఆస్పత్రి కోసం గంట సమయం కేటాయిస్తానన్నారు. కోడ్ ముగిసిన తరువాత కలెక్టర్‌తో కలిసి పర్యటించి స్వల్ప సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. నాలుగు సంవత్సరాల కాలంలో ఎన్ని సార్లు ఎంజీఎంలో విద్యుత్ నిలిచిపోయిందో తన వద్ద అధికారిక లెక్కలు ఉన్నాయని మాజీ మంత్రి కేటీఆర్‌పై మండిపడ్డారు. ఎమ్మెల్యే వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, బుద్ధ జగన్, రాములు, సురేందర్, బోడ డిన్నా, తోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్ సరఫరా పరిశీలన

హన్మకొండ: వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా లోపంతో విద్యుత్ కోతలపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తుంది. ఎంజీఎంలో విద్యుత్ అంతరాయంపై ప్రభుత్వం, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి కారణాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో టీజీఎన్పీడీసీఎల్ అధికారులు ప్రభుత్వ ఆస్పత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలిస్తున్నారు. గురువారం హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు, ఏఈలతో కలిసి హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణ హనుమకొండలోని ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ మెటర్నిటీ, టీబీ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్‌లతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న జనరేటర్లను ఎప్పటికప్పుడు మెయింటేయిన్ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్లకు సూచించారు. మెయింటేయిన్ కోసం ఏఎంసీని నియమించుకోవాలన్నారు. అదే విధంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనరేటర్లు లేదా.. ఇన్వర్టర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రోలర్‌లో పడి కార్మికుడి మృతి

- గణేశ ఎకోటెక్ కంపెనీలో ఘటన



మంజునాథ మృతదేహం

గీసుకొండ : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో గణేశ ఎకోటెక్ కంపెనీలోని రోలర్‌లో పడికార్మికుడు మంజునాథ యాదవ్(23) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్ పట్టణం రసూల్‌పూర్‌కు చెందిన మంజునాథ యాదవ్ గతేడాది నుంచి గణేశ కంపెనీలో పీఎస్ఎఫ్ రోలర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ప్లాస్టిక్ రోల్ అవుతున్న క్రమంలో చిక్కుపడిన ధారాలను కట్ చేస్తుండగా చేయిని రోలర్ లాక్కోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఉదయం కార్మికులను తీసుకుని వచ్చే మినీ బస్ ఢీకొని ఇదే కంపెనీలో పని చేసే కార్మికుడు ఏనుగల్‌కు చెందిన జిలానీ పాషాకు గాయాలైనట్లు సహచర కార్మికులు తెలిపారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

భవన నిర్మాణ కార్మికుడు..

కేసముద్రం: ఇంటి గోడకు ప్లాస్టింగ్ పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు గోవకర్రపై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలం రంగాపురంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దొంతరబోయిన రమేశ్ (45) ఇదేగ్రామానికి చెందిన భూక్య భద్రు ఇంటిగోడకు ప్లాస్టింగ్ పనిచేసేందుకు బుధవారం వెళ్లాడు. ఈక్రమంలో గోవకర్రపై ఉన్న రమేశ్ గోడకు ప్లాస్టింగ్ చేస్తుండగా కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో మానుకోట జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. దీంతో మృతదేహన్ని భద్రు ఇంటిఎదుట ఉంచి బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ ఘటనా స్థలికి చేరుకుని సముదాయించడంతో వివాదం సద్దుమనిగింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య మల్లికాంబ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- 4.06 తులాల బంగారం, 5 తులాల వెండి, 2 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 4.06 తులాల బంగారం, 5 తులాల వెండి ఆభరణాలు, 2 సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లించారు. ఎస్సై జి.ఉపేందర్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పూలే జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో మహబూబాబాద్ టౌన్ పీఎస్ పరిధిలో జరిగిన చోరీ కేసులో అరెస్ట్ అయిన గార్ల మండలం వికలాంగుల కాలనీకి చెందిన చింత యుగంధర్ అని తేలింది. ఖమ్మం, మహబూబాబాద్ పట్టణంలో పలు చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతడి వద్ద నుంచి 4.06 తులాల బంగారం, 5 తులాల వెండి ఆభరణాలు, 2 సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై జి.ఉపేందర్, సీసీఎస్ సీఐ బి.చంద్రమౌళి, సిబ్బంది అబ్దుల్ నాయక్, గోపి, నరేష్, శ్రీకాంత్, సుధీర్, ఉపేందర్, భజన్ లాల్‌ను డీఎస్పీ ఎన్.తిరుపతిరావు అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హసన్‌పర్తి, వేలేరు, వంగర, బండారుపల్లి, కొడకండ్ల, నెక్కొండ గురుకుల జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు హసన్‌పర్తిలోని గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్లమాధ్యమంలో బోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనుభవం, మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. జూన్ 1వ తేదీన హసన్‌పర్తి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9866559727 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్.. ఏడున్నర గంటల ఆలస్యం

డోర్నకల్: ఆదిలాబాద్- తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ గురువారం ఏడున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. కొద్ది రోజులుగా మధిర, బోనకల్ మధ్య రైల్వే లైన్ పనులు జరుగుతుండడంతో ఈ మార్గంలో నడిచే రైళ్లను నడికుడ మార్గంలోకి మళ్లించారు. గురువారం కొన్ని రైళ్లను ఈ మార్గంలో పునరుద్ధరించారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను యథావిధిగా ఆదిలాబాద్ నుంచి కాజీపేట, ఖమ్మం మీదుగా తిరుపతి నడిపించారు. బుధవారం నడికుడ మీదుగా ఆదిలాబాద్‌కు ఆలస్యంగా చేరుకున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్.. గురువారం ప్రారంభ స్టేషన్ నుంచే ఆలస్యంగా బయలుదేరింది. దీంతో డోర్నకల్ స్టేషన్‌కు ఉదయం 9.45 రావాల్సిన రైలు 7 గంటల 42 నిమిషాల ఆలస్యంతో సాయంత్రం 5.27 నిమిషాలకు చేరుకుంది. ఫలితంగా ఈ రైల్‌లోతిరుపతితో పాటు విహార యాత్రలకు వెళ్తున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



హరీశ్ (ఫైల్)

రఘునాథపల్లి: తండ్రి మందలించడానే కారణంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లికి చెందిన బర్ల సదయ్య రెండు రోజుల క్రితం ధాన్యం ఆరబెట్టే విషయంలో కుమారుడు హరీశ్ (20)ను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన హరీశ్ బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం రాత్రి పురుగుల మందు, తాడు, మద్యంతో గోవర్ధనగిరి శివారుకు చేరుకున్నాడు. అక్కడే చెట్టుకు ఉరివేసుకున్నాడు. గురువారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని మృతుడి ఆధార్ కార్డు పరిశీలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పిల్లలకు ఆర్థిక సాయం

- యువసేన యూత్ రూ.10,600, ఓ దాత రూ.5 వేల అందజేత

సాక్షి స్పందన



బాధిత పిల్లలకు రూ.10,600 నగదు అందజేస్తున్న యూత్ సభ్యులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామానికి చెందిన గుండె మహేష్ చనిపోవడంతో ముగ్గురు పిల్లలను సాకలేక తల్లి ఇబ్బందులు పడుతున్న వైనంపై 'ఆపన్న హస్తం అందించరూ' అనే శీర్షిక గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన వంటికొమ్ము అప్పారెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన యువ సేన యూత్ సభ్యులు రూ.10,600 అందించారు. కార్యక్రమంలో దాతలు పాల్వాయి వెంకన్న, రాములు, ఉప్పలయ్య, రవి, సావిత్రి, వెంకన్న, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, మహేష్ పిల్లలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మస్కపురి రమేశ్ పేర్కొన్నారు. మృతుడి ఇంటిని సందర్శించి కుటుంబీకులతో మాట్లాడి భరోసా కల్పించారు.

సీసీ ఫుటేజీ బయట పెట్టడంలో జాప్యం

- అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి

కేయూ క్యాంపస్: కేయూలోని వీసీ లాడ్జ్ నుంచి పలు కీలక ఫైళ్లు మార్ఫింగ్ చేసేందుకు సీసీ ఫుటేజీ మాయం చేశారని ఆరోపిస్తూ.. రెండ్రోజుల కిందట కేయూ అధ్యాపకుల సంఘం బాధ్యులు.. రిజిస్ట్రార్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు ఫైళ్ల మాయం గురించి వీసీ లాడ్జ్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించి బయటపెట్టకుండా జాప్యం చేస్తున్నారని గురువారం అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సీసీ ఫుటేజీ బయటపెట్టడంలో కావాలనే రిజిస్ట్రార్ జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ నేపథ్యంలో ఫైళ్లు మాయం కావడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. సీసీ ఫుటేజీని బయటపెట్టాలని, మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మామిడాల ఇస్తారి డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్

- హాజరైన 2,136 మంది అభ్యర్థులు



హనుమకొండలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి పరీక్ష రాసి వస్తున్న విద్యార్థినులు

విద్యారణ్యపురి : 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకుగాను గురువారం ఎడ్‌సెట్- 2024 నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో వరంగల్, హనుమకొండలో ఐదు పరీక్షకేంద్రాలు, నర్సంపేటలో ఒక పరీక్ష కేంద్రంలో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, నోబెల్ టెక్నాలజీ సొల్యూషన్స్, వశిష్ట టెక్నాలజీ, మోక్షిత కంప్యూటర్స్, నర్సంపేటలో బిట్స్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లలో ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్) విధానంలో పరీక్ష నిర్వహించారు. రెండు సెషన్లలో మొత్తం 2,376 మంది పరీక్ష రాయల్సిండగా 2,136మంది అభ్యర్థులు హాజరయ్యారని 240మంది గైర్హాజరయ్యారని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి మృణాళిని తెలిపారు.